www.kalamdaily.com

Follow on: Kalamtelugu

# కలం

ప్రజల గళం...

04-03-2026, బుధవారం

360° SINGLE TOPIC

గవర్నమెంట్ యాడ్స్



> రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదు... వచ్చే ఆదాయంలో పెద్ద మొత్తం గత సర్కార్ చేసిన అప్పులకు, వడ్డీలకే చెల్లించాల్సి వస్తున్నది... మేం అనవసరం హంగులు, ఆర్భాటాలు, దుబారా ఖర్చులు తగ్గించుకొని చక్కదిద్దుతున్నాం.
>
> - సీఎం రేవంత్ రెడ్డి

> మేం కడుపు కట్టుకొని రాష్ట్రాన్ని చక్కదిద్దుతున్నాం.. అవసరంలేని ఖర్చులు తగ్గించుకొని ప్రజల సంక్షేమానికి ఖర్చుచేస్తున్నాం.
>
> - కేసీఆర్ (పవర్‌లో ఉన్నప్పుడు)

# ప్రజల సొమ్ము.. పార్టీల సోకు

నాడు బీఆర్ఎస్ సర్కార్.. నేడు కాంగ్రెస్ సర్కార్.. సేమ్ టు సేమ్

## ఉద్యోగులకు టైమ్‌కు జీతాలివ్వకున్నా దేశమంతా కేసీఆర్ గొప్పలు

## ఆర్థిక పరిస్థితి బాలేదంటూనే ఇతర రాష్ట్రాల్లో రేవంత్‌రెడ్డి యాడ్స్

ఎవరి మాటలు ఎలా ఉన్నా ప్రజాధనం దుర్వినియోగంలో ఇద్దరికిద్దరూ సేమ్ టు సేమ్. గొప్పలు చెప్పకోవడంలో, వాటిని దేశమంతా ప్రచారం చేసుకోవడంలో దొందూ దొందే! 'దేశ్ కీ నేత' అంటూ దేశమంతా ప్రచారం కోసం నాడు కేసీఆర్ కోట్లకు కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. తెలంగాణలో అమలవుతున్న స్కీమ్‌లు చూడండి.. అంటూ అన్ని ప్రాంతీయ భాషా పత్రికల్లోనూ ఎడాపెడా యాడ్స్ ఇచ్చిపారేశారు. రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల పేరుతో 2023లో వందల కోట్లు వీటి కోసమే ఖర్చు చేశారు. సౌత్ స్టేట్స్‌తోపాటు యూపీ, మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్ సహా అన్ని రాష్ట్రాల్లో యాడ్స్ కుమ్మరించారు. పంజాబ్, హర్యానా రైతులకు ఆర్థిక సాయం చేస్తున్నామంటూ దానిపైనా యాడ్స్ ఇచ్చారు. అప్పట్లో దీన్ని దుయ్యబట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే ట్రెండ్‌ను ఫాలో అవుతున్నది. కేరళ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మలయాళ మనోరమ, మాతృభూమి లాంటి పత్రికలకు యాడ్స్ ఇచ్చి తెలంగాణ స్కీమ్‌లను ఊదరగొడుతున్నది.

రెండు పార్టీల అధికార దుర్వినియోగం, ప్రజాధనం దుబారాపై కలం 360 డిగ్రీస్ స్పెషల్...

తెలంగాణ బ్యూరో, కలం

### 'దేశ్ కీ నేత' గొప్పల కోసం మరింతగా..

రెండోసారి పవర్‌లోకి వచ్చిన తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలనే ఆలోచనతో కేసీఆర్ తనకు తానుగా 'దేశ్ కీ నేత' ప్రచారం కోసం భారీగానే ప్రజాధనాన్ని వాడుకున్నారు. టీఆర్ ఎస్ నుంచి బీఆర్ ఎస్‌గా పార్టీ పేరును మార్చుకున్న తర్వాత మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో ప్రచారం కోసం రకరకాల రూపాల్లో ప్రజాధనాన్ని దుబారా చేసినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల చేసిన ఆందోళనలు హింసాత్మకం కావడంతో పలువురు రైతులు మృతిచెందారు. బీజేపీపై వ్యతిరేకతను రాజకీయ స్వప్రయోజనాలకు వాడుకునే ఉద్దేశంతో పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల రైతులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున నష్టపరిహారం పేరుతో వందల కోట్లను కేసీఆర్ వెచ్చించారు. 'దేశ్ కీ నేత' ప్రచారం కోసమే దీన్ని ఖర్చు చేసినట్లు విమర్శలు వచ్చాయి.



### కాంగ్రెస్ సర్కార్‌దీ అదే దారి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నదని చెప్పుకుని గత ప్రభుత్వ దుబారా ఖర్చుల గురించి ప్రస్తావించిన కాంగ్రెస్ సైతం అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ ఎస్ లానే 'దుబారా' ట్రెండ్‌ను కొనసాగిస్తున్నది. భారత్ సమ్మిట్, గ్లోబల్ సమ్మిట్ నిర్వహణను గొప్పగా చెప్పుకుంటూ హిందీ, ఇంగ్లిష్, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లోని పత్రికల్లో యాడ్‌ల పేరుతో భారీగానే ఖర్చు చేసింది. దావోస్‌లో 2024, 2025లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమ్మిట్‌లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు అవగాహనా ఒప్పందాలు కుదిరాయనే ప్రచారాన్ని హోర్డింగులు, ఫ్లెక్సీల రూపంలోనే కాకుండా ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల్లో భారీగానే ఖర్చు చేసింది. గతేడాది హైదరాబాద్ లో భారత్ సమ్మిట్‌కు ప్రభుత్వంతో సంబంధం లేదని పార్టీ చెప్పుకున్నా ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ద్వారా రూ. 29.45 కోట్లను ఖర్చు చేసింది. గ్లోబల్ సమ్మిట్‌కు కూడా గణనీయంగా ఖర్చు చేసింది.

### కేరళ ఎన్నికలకు తెలంగాణ డబ్బు !

కేరళ అసెంబ్లీ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరుగుతున్నందున తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు అమలుచేస్తున్న స్కీమ్‌లను అక్కడి ప్రజలకు తెలిసేలా మలయాళ పత్రికల్లో ప్రచారం చేసుకుంటున్నది. అక్కడి ప్రజాదరణ ఉన్న పత్రికల్లో ఫుల్ పేజీ కలర్ యాడ్‌లు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నది. గత నెల 28న మలయాళ మనోరమ, మాతృభూమి పత్రికల్లో ఫ్రంట్ పేజీ యాడ్‌లు ఇచ్చింది. కేరళతో పాటు తమిళనాడు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతున్నందున రానున్న రోజుల్లో తమిళ పత్రికలకు కూడా ఈ ట్రెండ్‌ను కంటిన్యూ చేసే అవకాశాలు లేకపోలేదు. బీఆర్ఎస్‌తో పోలిస్తే తక్కువే అయినా రెండేండ్లలోనే దాదాపు రూ. 115 కోట్లను ఖర్చు చేసినట్లు అంచనా. బీఆర్ఎస్ పవర్ కోల్పోడానికి ముందు 2023లో గరిష్ట స్థాయిలో రూ. 244 కోట్లను ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత 2024లో రూ. 85 కోట్లను, రెండో సంవత్సరం (2025)లో రూ. 30 కోట్లను ఖర్చు చేసింది. కేరళ, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల రీత్యా కాంగ్రెస్ ప్రచార ఆర్భాటానికి పబ్లిసిటీ ఖర్చు ఇది ఏ స్థాయికి పెరుగుతుందో వేచి చూడాలి.

### నాలుగేండ్లలో బీఆర్ఎస్ దుబారా 310 కోట్లు

రాష్ట్రం ఏర్పడిన కొత్తలో సంక్షేమ పథకాల పేరుతో గొప్పలు చెప్పుకోడానికి బీఆర్ఎస్ సర్కారు భారీగానే ఖర్చు చేసింది. ఔట్ డోర్ పబ్లిసిటీ, టీవీలు, పత్రికల్లో యాడ్స్ కుమ్మరించి 2014-18 మధ్యకాలంలో రూ. 310 కోట్లను ఖర్చు చేసింది. సంక్షేమంలో తెలంగాణ నెంబర్ వన్ అని ప్రచారం చేసుకున్నది. పథకాల ప్రచారానికి ఫ్లెక్సీలు, కటౌట్‌లు, హోర్డింగుల రూపంలో ఔట్ డోర్ పబ్లిసిటీకి నాలుగేండ్లలో రూ. 191 కోట్లను ఖర్చు చేసింది. ఇక టీవీల్లో ప్రచారానికి మరో రూ. 120 కోట్లను ఖర్చు చేసింది. రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు, హరితహారం స్కీమ్‌కు, బతుకమ్మ సెలబ్రేషన్స్ కు, తెలంగాణ గొప్పదనాన్ని ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసుకోడానికి ప్రజాధనాన్ని వాడుకున్నది. మొదటి టర్మ్ చివర్లో రైతుబంధు స్కీమ్ ప్రచారానికీ పత్రికా ప్రకటనల పేరుతో భారీగానే ఖర్చు చేసింది.


### తొమ్మిదిన్నరేండ్లలో రూ. 1,757 కోట్లు

కేసీఆర్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేండ్ల కాలంలో యాడ్స్ కోసం రూ. 1,757 కోట్లను దుబారాగా ఖర్చు చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. సొంత పత్రికలు, టీవీ ఛానెళ్ల టారిఫ్‌ను పెంచి వాటికి ఆదాయాన్ని సమకూర్చడానికి రాష్ట్ర పౌరసంబంధాల విభాగం నుంచి యాడ్‌ల రూపంలో ప్రజాధనాన్ని కుమ్మరించారు. ఈ శాఖ తరఫున అయిన మొత్తం ఖర్చులో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే పత్రికలకు ఇచ్చిన యాడ్‌ల వాటా దాదాపు 19%. తొమ్మిదిన్నరేండ్ల కాలంలో నమస్తే తెలంగాణకు రూ. 182 కోట్లు, తెలంగాణ టుడే పత్రికకు రూ. 150 కోట్లను ఖర్చు చేసినట్లు తేలింది. మొత్తం ప్రింట్ మీడియాకు ఈ డిపార్టుమెంటు చేసిన ఖర్చులో ఈ రెండు పత్రికలకే దాదాపు 38.4% ఖర్చయింది. ఇతర పత్రికలతో పోల్చుకుంటే తక్కువ సర్క్యులేషన్ ఉన్నా టారిఫ్‌ను పెంచడం ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.



### బీఆర్ఎస్ ప్రచార ఆర్భాటపు ఖర్చులు ఇలా..: (రూ. కోట్లలో)

(నోట్: ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా యాడ్‌ల ఖర్చు వివరాలు అందుబాటులో ఉన్న మేరకు)




### కాంగ్రెస్ రెండేండ్ల ప్రచారం ఖర్చు ఇలా : (రూ. కోట్లలో)

